Follow: @ANNTELUGU
ANN తెలుగు
REGISTERED NUMBER: APTEL/2014/58382
12-11-2025
మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 324 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD బుధవారం WWW.EPAPER.MAHAADAILY.COM

## టాప్ న్యూస్

### భారీ మెజారిటీతో నవీన్ గెలుపు



- ఉప ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

02

### ఢిల్లీ పేలుడు కారకులను వేటాడుతాం



- ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన అమిత్ షా
- ప్రతి ఒక్క దోషిని వేటాడి పట్టుకోవాలని ఆర్డర్స్
- ఢిల్లీ పేలుళ్ల కేసు ఎన్ఐఏకి హ్యాండోవర్.. సెర్చ్ ఆపరేషన్ ప్రారంభం


02

### తెలంగాణ ఏఐసీసీ కో-ఇన్‌చార్జిగా సచిన్ సావంత్



- ఉత్తర్వులు జారీ చేసిన కేసీ వేణుగోపాల్
- మీనాక్షి నటరాజన్‌కు సహాయకుడిగా పనిచేయనున్న సచిన్

02




టుడే చాణక్య- ఎఎన్ఎన్ సర్వే

| | |
|---|---|
| కాంగ్రెస్ | 51 |
| బీఆర్ఎస్ | 42 |
| బీజేపీ | 6 |

టుడే చాణక్య- ఎఎన్ఎన్ పోస్ట్ పోల్ అంచనాల ప్రకారం కాంగ్రెస్ కు 51, బిఆర్ఎస్ -42, బిజెపి-6 శాతంగా కనిపించింది. ప్రిపోల్ సర్వే సందర్భంగా కూడా పోలింగ్ 50శాతం దాటితే 15వేల మెజారిటీని కైవసం చేసుకునే అవకాశం ఉందని టుడేచాణక్య అంచనాలు వెలువరించింది. జూబ్లీహిల్స్ ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# హస్తం హవా

## జూబ్లీహిల్స్‌లో జోరు

- ఫలించిన ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహాలు
- అభ్యర్థి ఎంపిక నుండి.. ఆఖరి గంట పోలింగ్ దాకా.. అన్నీ తానై పనిచేసిన సీఎం
- అధికార పార్టీ వైపే ఓటర్ల మొగ్గు.. కాంగ్రెస్ సర్కార్ పైనే ప్రజావిశ్వాసం
- తేల్చిచెప్పిన ఎగ్జిట్ పోల్స్.. మెజారిటీ 10 నుండి 20వేల దాకా వచ్చే అవకాశం
- బీజేపీ డిపాజిట్ గల్లంతేనంటున్న సర్వేలు .. కారు పార్టీకి షాకే

**ట్రెండ్స్ ను ముందే చెప్పిన టుడే చాణక్య- ఎఎన్ఎన్**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ఉత్కంఠ భరితంగా సాగగా, ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఈనెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. పోలింగ్ జరిగిన తీరుపై పలు మీడియా, సర్వేసంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ అన్నీ హస్తం హవాను స్పష్టం చేశాయి. పోలింగ్ రోజు వరకు కారు జోరు.. మిగతా వాళ్ళు బేకారు అన్న గులాబీపార్టీ మధ్యాహ్నం నుండి ఒక్కసారిగా సైలెంట్ అయిపోయింది. గత నాలుగైదురోజులుగా బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్ అవుతుండగా, చేతికి నియోజకవర్గం పూర్తిగా చిక్కిందని మహా పత్రికలో గ్రౌండ్ రిపోర్ట్ ను స్పష్టంగా చెప్పింది. పోలింగ్ రోజు అదే కనిపించింది. పోలింగ్ ట్రెండ్స్ ను బట్టి 10 నుండి 20వేల వరకు మెజారిటీ లభించే అవకాశాలున్నట్లు స్పష్టమవుతోంది. ప్రదానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోల్ మేనేజ్ మెంట్ , ప్రచారం, పోలింగ్ చివరిదాకా పరిస్థితిని పర్యవేక్షించడం కాంగ్రెస్ కు అడ్వాంటేజ్ గా మారాయి. అభ్యర్థి ఎంపిక నుండి ఆఖరి గంట పోలింగ్ దాకా సీఎం ప్రతివ్యూహం సక్సెస్ అయినట్లు కనిపించింది. ముందుగా ఆయాసపడ్డ బీఆర్ఎస్.. ఆఖర్లో అధికారపార్టీ ముందు చేతులెత్తేసిన వాతావరణం కనిపించింది. ఇక మంత్రులు పొన్నంప్రభాకర్, వివేక్, తుమ్మల నాగేశ్వరరావు ముందునుండీ కష్టపడగా, చివర్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలకంగా మారారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి ఉత్తమ్, జూపల్లి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, విజయరమణారావు, రామచంద్రనాయక్ రాందాస్ నాయక్ తదితర ఎమ్మెల్యేలు, ఛైర్మన్లు, నేతలు గట్టిగా గ్రౌండ్ లో పనిచేశారు.

### ఎగ్జిట్ పోల్స్ హస్తగతం

జూబ్లీహిల్స్ పై పలు సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వెలువరించాయి. చాణక్య స్ట్రాటజీస్ ప్రకారం కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి(బీఆర్ఎస్) 43 శాతం, బీజేపీకి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే ఎగ్జిట్ పోల్ ఫలితాల ప్రకారం కాంగ్రెస్‌కు 48.3శాతం, బీఆర్ఎస్‌కు 43.18శాతం, బీజేపీకి 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని అంచనా వేసింది. స్మార్ట్ పోల్ సర్వే ప్రకారం కాంగ్రెస్‌కు 48.2శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, బీజేపీ 7.6 శాతం, ఇతరులకు 2.1శాతం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది.

### మైత్రీవనంలో అన్నగారు

బైపోల్ లో టీడీపీ ఓటర్లు కాంగ్రెస్ కు మద్దతుగా నిలవగా, మైత్రీవనంలో అన్నగారు అంటూ ఏఐ వీడియోలు, ఫొటోలతో సందడి చేశారు. కాంగ్రెస్ కు, సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో భారీ పోస్టింగ్ లు పెట్టారు. చివరివారంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా డౌన్ కాగా, కాంగ్రెస్ కు టీడీపీ సోషల్ మీడియా కూడా కలిసొచ్చింది.

### ఎన్డీయేదే బీహారం

- తేల్చిన మెజారిటీ ఎగ్జిట్ పోల్స్
- మహాగట్ బంధన్ నిరాశ తప్పదంటున్న సర్వేలు
- పనిచేయని ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' ఫ్యాక్టర్
- ఓటెత్తిన బీహార్.. రాష్ట్ర చరిత్రలో రికార్డు స్థాయి పోలింగ్

02



# ఢిల్లీ బ్లాస్ట్ వెనుక జైషే మహ్మద్

## పాకిస్థాన్ పై యుద్ధం తప్పదా?

### ఆపరేషన్ సింధూర్ 2.0 ప్రారంభమవుతుందా?

- దేశవ్యాప్తంగా చర్చలు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాలంటూ డిమాండ్లు
- విషంతో చంపాలనుకోవడంపై ఉలిక్కిపడ్డ దేశం
- దాడి కుట్రదారులను వదిలిపెట్టమని మోదీ ప్రకటన
- జైషే మహ్మద్ సంస్థతో సంబంధం ఉన్న 8 మంది అరెస్ట్

**మహా నెట్ వర్క్ :** ఢిల్లీ బ్లాస్ తో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది చనిపోగా, చాలా మంది ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ పేలుడు వెనుక పాకిస్థాన్ కు చెందిన జైషే మహ్మద్ సంస్థ ఉందనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధానితోపాటు ఇతర ప్రాంతాల్లో భద్రతను కేంద్ర హోం శాఖ సమీక్షించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన కర్తవ్యభవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా విచారణ అధికారులు అనేక ప్రాంతాల్లో ఉగ్ర మురాలను ఛేదిస్తున్నారు. ఇప్పటివరకు బయటపడిన వివరాల ప్రకారం, ఈ ఉగ్ర కుట్రల్లో భాగమైన వారిలో ఐదుగురు డాక్టర్లు ఉన్నారని వెల్లడైంది. వైద్య వృత్తిలో ఉన్నవారు ఉగ్రవాద సంస్థలతో సంబంధం పెట్టుకోవడం ఆశ్చర్యకరంగా మారింది. జమ్ముకశ్మీర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు వైద్యులు అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఉన్నారు. వారిలో షాహిన్ అనే మహిళా డాక్టర్ లక్నోలో అరెస్టయ్యింది. ఆమె వాహనంలోనుంచి పోలీసులు ఏకే-47 తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర పోలీసులు, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో 2,900 కిలోల పేలుడు పదార్థం అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ వంటి రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా 2లో

### ఆపరేషన్ సింధూర్ 2.0 తప్పదా?

ఉగ్రదాడుల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం, ప్రధాని మోదీ చాలా సీరియస్ గా ఉన్నారు. మరో దాడి జరిగితే తీవ్ర పరిణామాలు తప్పవు అంటూ హెచ్చరించిన మోదీ ఆపరేషన్ సింధూర్ 2.0 ప్రారంభించడం ఖాయమని, పాకిస్థాన్ యుద్ధాన్ని ఎదర్కోవడానికి సిద్ధం కావాల్సిందేనన్న చర్చలు నెట్టింట జరుగుతున్నాయి. కేంద్రం మాత్రం ఉగ్రవాదుల దుశ్చర్యలపై చాలా సీరియస్ గా ఉంది.



02

### సాహిత్య సమరయోధుడికి కడసారి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు
- అందెశ్రీ పార్థీవ దేహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్
- అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసిన ముఖ్యమంత్రి
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు

### అందెశ్రీకి పద్మశ్రీ

- రాబోయే కేబినెట్ సమావేశంలో నిర్ణయం
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలి
- పాఠ్యాంశంగా 'జయ జయహే తెలంగాణ' గీతం
- అందెశ్రీని ఖననం చేసిన ప్రాంతాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దుతాం.. సీఎం కీలక ప్రకటన

02

### నేడో రేపో డీసీసీలు

- కాంగ్రెస్ లో పదవుల పందారం
- మార్పులు.. చేర్పులు
- ఈనెలలోనే స్థానిక ఎన్నికల షెడ్యూల్

02

### సీఐడీ సిట్ విచారణకు విజయ్ దేవరకొండ

వివరాలు 2లో

### ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భీకర ఎన్‌కౌంటర్

#### ఆరుగురు మావోయిస్టుల మృతి



- బీజాపూర్ జంగిల్లలో బలగాల మెరుపు ఆపరేషన్
- మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
- అగ్రనేతలు బుచ్చన్న, ఊర్మిల మృతి
- బస్తర్ రేంజ్‌లో క్షీణించిన మావోయిస్టుల ప్రభావం
- ఐజీ సుందర్‌రాజ్ వెల్లడి

**ఖమ్మం బ్యూరో, మహా.** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతం మంగళవారం భీకర యుద్ధరంగాన్ని తలపించింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ప్రారంభమైన ఎదురుకాల్పులు రాత్రి వరకు కొనసాగగా, ఈ ఘర్షణలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మిగతా 2లో




Gold Jewellery 3% V.A ONWARDS
manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890
Diamonds ₹49,950/- Onwards E-F / VVS
General Bazar 9912010888 | Punjagutta 7893800555 | Kukatpally 8897387888 | Dilsukhnagar 6309111699 | Chandanagar 8712690020 | Suchitra Circle 8712690030
*T&C Apply



# ఎన్డీయేదే బీహారం

## తేల్చిన మెజారిటీ ఎగ్జిట్ పోల్స్

- మహాగట్ బంధన్ నిరాశ తప్పదంటున్న సర్వేలు
- పనిచేయని ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' ఫ్యాక్టర్
- ఓటెత్తిన బీహార్.. రాష్ట్ర చరిత్రలో రికార్డు స్థాయి పోలింగ్

**బీహార్, మహా:** ఉత్కంఠగా సాగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జేడీయూ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారం చేపడుతుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. ఎన్డీయే, మహాఘట్ బంధన్ కూటముల మధ్య కొంత పోరు సాగినప్పటికీ... విజయానికి అవసరమైన స్థానాలను ఎన్డీయే కూటమి కైవసం చేసుకుంటుందని పేర్కొన్నాయి. తద్వారా ఎన్డీయే కూటమి బీహార్‌లో అధికారాన్ని కాపాడుకుంటుందని తెలిపాయి. ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని కూడా అంచనా వేశాయి. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా... అక్కడ అధికారం చేపట్టేందుకు 122 స్థానాల్లో విజయం సాధించడం అవసరం. పలు ఎగ్జిట్ పోల్స్ ఇలా అంచనా వేశాయి.

బీహార్‌లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు దశల్లో పోలింగ నిర్వహించగా... తొలి విడతలో ఈ నెల 6న 121 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించారు. నేడు చివరి విడతలో 122 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. తొలిదశలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 64.66 శాతం పోలింగ్ నమోదైంది. అయితే రెండో విడతలో అంతకుమించి పోలింగ్ శాతం నమోదైంది. ఎన్నికల సంఘం డేటా ప్రకారం... బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడతలో దాదాపు 68.48 శాతం ఓటింగ్ నమోదైంది. ఇందుకు సంబందించి తుది గణంకాలు వెల్లడి కావాల్సి ఉంది. ఇక, బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 14న చేపట్టనున్నారు.

**రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో ఫస్ట్ టైం..**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. 20 జిల్లాల పరిధిలోని 122 సీట్లకు మంగళవారం పోలింగ్ జరిగింది. ఈ విడతలో 3.7 కోట్ల మంది ఓటర్లకు గాను.. సాయంత్రం 5 గంటల సమయానికి రికార్డు స్థాయిలో 67.14శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి విడతలోనూ 65.9 శాతం భారీ పోలింగ్ రికార్డైన విషయం తెలిసిందే. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. 2000లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 62.57శాతం నమోదు కాగా.. ఇప్పటివరకు ఇదే గరిష్ఠం. లోక్‌సభ ఎన్నికల విషయానికొస్తే.. 1998లో అత్యధికంగా 64.6శాతం పోలింగ్ నమోదైంది.

| | | | | |
|---|---|---|---|---|
| జేవీసీ | ఎన్డీయే - 135-150 | మహాఘట్‌బంధన్ - 88-103 | జన్ సురాజ్ - 0-1 | ఇతరులు - 3-6 |
| పీపుల్స్ పల్స్ | ఎన్డీయే - 133-159 | మహాఘట్‌బంధన్ - 75-101 | జన్ సురాజ్ - 0-5 | ఇతరులు - 2-8 |
| చాణక్య స్ట్రాటజీస్ | ఎన్డీయే - 130-138 | మహాఘట్‌బంధన్ - 100-108 | జన్ సురాజ్ -0-0 | ఇతరులు- 0-5 |
| పీపుల్స్ ఇన్‌సైట్ | ఎన్డీయే - 133-148 | మహాఘట్‌బంధన్ - 87-102 | జన్ సురాజ్ - 0-2 | ఇతరులు- 3-6 |
| డీవీ రీసెర్చ్ | ఎన్డీయే - 137-152 | మహాఘట్‌బంధన్ - 83-98 | జన్ సురాజ్ - 2-4 | ఇతరులు -0-0 |
| మ్యాట్రిజ్ | ఎన్డీయే - 147-167 | మహాఘట్‌బంధన్ - 70-90 | జన్ సురాజ్ - 0-2 | ఇతరులు - 2-8 |

# ఢిల్లీ బ్లాస్ట్ వెనుక జైషే మహ్మద్

(మొదటిపేజీ తరువాయి)




ఈ వివరాలు వెలుగులోకి రావడంతో ఫరీదాబాద్, కశ్మీర్, లఖ్‌నవూ ప్రాంతాల్లో ఉగ్ర నెట్‌వర్క్ విస్తృతంగా పనిచేస్తోందని అధికారులు భావిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, ఉమర్ నబీ ఒకప్పుడు ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ మెడికల్ కాలేజీలో రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేశాడు. అక్కడే మరో ఉగ్ర అనుమానితుడు ముజమ్మిల్ షకీల్ సీనియర్ రెసిడెంట్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరూ ఒకే ఆసుపత్రిలో పనిచేయడం వల్ల సన్నిహితులు అయ్యారని తెలుస్తోంది. ఫరీదాబాద్ పోలీసులు ఉమర్, ముజమ్మిల్ కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషిస్తూ, వారు ఇటీవల ఢిల్లీలోకి వచ్చిన సమయాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరూ కలిసి పేలుడు పదార్థాలతో ఢిల్లీకి వచ్చారా? లేక వేర్వేరుగా కదిలారా? అనే అంశాలు పరిశీలనలో ఉన్నాయి. ఇక జమ్మూకశ్మీర్ పోలీసులు వెలుగులోకి తెచ్చిన ఉగ్ర నెట్‌వర్క్‌తో ఉమర్‌కు ఉన్న సంబంధాల పై కేంద్ర గూఢచారి సంస్థలు దృష్టి సారించాయి. ఉగ్ర ముఠాలకు వైద్యుల మద్దతు, వారి సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై కూడా విచారణ కొనసాగుతోంది. అధికారుల అనుమానం ప్రకారం, ఉమర్ గత కొంతకాలంగా ఉగ్రవాద సిద్ధాంతాల ప్రభావానికి లోనై, ప్రేరేపితుడయ్యాడు. తన సహచరుల అరెస్ట్, పేలుడు పదార్థాల స్వాధీనంతో నిరాశ చెంది, చివరకు ఆత్మాహుతి దాడి ద్వారా పేలుడు జరిపి ఉండొచ్చని భావిస్తున్నారు. అతడు జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని కోయిల్ గ్రామానికి చెందిన వాడు. ఉమర్ తల్లి షమీమా బానో, తండ్రి జీహెచ్ నబీ భట్. భట్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి దశాబ్దం క్రితమే పదవీ విరమణ చేశారు. ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, ఎండీ (మెడిసిన్) పూర్తి చేసిన తర్వాత కొన్నేళ్లు జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా పనిచేశాడు. తరువాత ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించాడు.

**టెర్రర్ డాక్టర్స్**

ఇటీవల దేశంలో జరిగిన అనేక పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఉగ్రకుట్రల్లో ఎక్కువ మంది వైద్యులు ఉండడం చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా 48 గంటల్లో ఐదుగురు వైద్యులు ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నారు. వీరంతా మన దేశానికి చెందిన వేర్వేరు ప్రాంతాలవారు కావడం గమనార్హం. యూపీకి చెందిన వైద్యురాలు షాహీన్ షహీద్‌కు పాక్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళా విభాగంతో సంబంధం ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. అంటే దేశద్రోహులు మన మధ్యే ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది.

**నిందితులను వదిలిపెట్టం - ప్రధాని నరేంద్ర మోదీ**

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. నిందితులను ఎట్టిపరిస్థితుల్లో కూడా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. భూటాన్ పర్యటనకు వెళ్లి ప్రధాని మోదీ, ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఈ రోజు నేను చాలా బరువెక్కిన హృదయంతో ఇక్కడికి వచ్చా. సోమవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన భయానక ఘటన ప్రతి భారతీయుడిని విషాదంలో ముంచేసింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకుంటున్నాను. దేశం మొత్తం ఈ కష్ట సమయంలో వారి పక్కనే ఉంది. సోమవారం రాత్రంతా దర్యాప్తు సంస్థలతో సంప్రదింపులో ఉన్నా. పలు దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడిస్తారు. కుట్రదారులను వదిలిపెట్టం. అమాయకుల ప్రాణాలు తీసిన వారందరికీ తగిన శిక్ష తప్పదు' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ఢిల్లీ పేలుడు కారకులను వేటాడుతాం

## ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన అమిత్ షా

### ప్రతి ఒక్క దోషిని వేటాడి పట్టుకోవాలని ఆర్డర్స్

### ఢిల్లీ పేలుళ్ల కేసు ఎన్ఐఏకి హ్యాండోవర్.. సెర్చ్ ఆపరేషన్ ప్రారంభం

**ఢిల్లీ, మహా:** ఎర్ర కోట సమీపంలో జరిగిన భారీ పేలుడుతో దేశ రాజధాని ఢిల్లీ ఉలిక్కిపడింది. ఢిల్లీ పేలుడు ఘటన వెనుక ఉన్న ప్రతి ఒక్కర్ని వేటాడాలని ఆదేశించినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఎర్రకోట సమీపంలో పేలుడు నేపథ్యంలో.. దేశ రాజధాని ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో భద్రతపై నేడు ఉన్నతాధికారులతో రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పేలుడు అనంతర పరిస్థితులను ఉన్నతాధికారులు ఈ సందర్భంగా కేంద్రమంత్రికి వివరించారు. 'ఢిల్లీ కారు పేలుడుపై సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాను. ఈ ఘటన వెనుక ఉన్న ప్రతి నిందితుడిని వేటాడాలని వారికి ఆదేశించాను. ఈ పేలుడులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై దర్యాప్తు సంస్థలు ఉక్కుపాదం మోపుతాయి' అని సమావేశాల అనంతరం అమిత్ షా ట్వీట్ చేశారు. ఈ ఘటనపై అత్యున్నత దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయని, సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నాయని అంతకుముందు చెప్పారు. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ ఈ పేలుడు కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**రంగంలోకి ఎన్ఐఏ..**

ఉదయం నిర్వహించిన భేటీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ కుమార్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వర్చువల్‌గా హాజరయ్యారు. రెండో సమావేశంలోనూ దాదాపు ఈ ఉన్నతాధికారులే పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ పేలుడుపై మొదటగా ఢిల్లీ పోలీసులు ఉపా చట్టం, ఎక్స్‌ప్లోజివ్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే కేంద్రం దీన్ని ఉగ్ర చర్యగా భావిస్తున్నందున.. దర్యాప్తు ఎన్ఐఏకు అప్పగించారు. అయితే ఢిల్లీ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు నివేదికను హోం మంత్రిత్వ శాఖకు సమర్పించారు. జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో ఫరీదాబాద్ డాక్టర్లకు సంబంధాలపై నివేదికలో ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు.

# భారీ మెజారిటీతో నవీన్ గెలుపు

- ఉప ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్


హైదరాబాద్, మహా: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో.. పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతో పాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# అందెశ్రీకి పద్మశ్రీ..

## రాబోయే కేబినెట్ సమావేశంలో నిర్ణయం..

### కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలి.. పాఠ్యాంశంగా 'జయ జయహే తెలంగాణ' గీతం

### అందెశ్రీని ఖననం చేసిన ప్రాంతాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దుతాం.. సీఎం కీలక ప్రకటన



**హైదరాబాద్, మహా:** చివరి శ్వాస వరకు జీవితం సర్వస్వాన్ని ధారపోసి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గొప్ప పాత్రను పోషించిన ప్రజాకవి అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ..' గీతాన్ని పాఠ్య పుస్తకాల్లో ప్రథమ అంశంగా చేర్చుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాబోయే మంత్రిమండలి సమావేశంలో మంత్రుల సహకారంతో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని, తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ పేరును శాశ్వతం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఘట్‌కేసర్‌లో జరిగిన అందెశ్రీ అంతిమ సంస్కార కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి అక్కడ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన అందెశ్రీకి ద్మశ్మీ అవార్డును అందించి గౌరవించుకోవలసిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వం సూచిస్తుందని, ఈ విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

**రాష్ట్ర గీతంగా కోట్లాది మంది ప్రజలకు స్ఫూర్తి..**

"చివరి శ్వాస వరకు తన సర్వం ధారపోసి తెలంగాణ రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన అందెశ్రీని కోల్పోవడం వ్యక్తిగతంగా నాకు, నా కుటుంబానికి తీరని లోటు. నాకే కాదు యావత్ తెలంగాణ సమాజానికి ఎంతో బాధాకరం. తెలంగాణ విషయంలో వారితో చర్చించిన అనేక విషయాలు నాకు గొప్ప స్ఫూర్తినిచ్చాయి. రాష్ట్ర సాధనలో కోట్లాది మందిని ఏకం చేసి, తెలంగాణ ఉద్యమ బాటను నడిపించిన అందెశ్రీతో మాట్లాడుతున్నప్పుడు, చదువుకోవడానికి పట్నం వచ్చిన తమ్ముడిని ఊర్లో వ్యవసాయం చేసే అన్న చూడటానికి వచ్చినప్పుడు కలిగే అనుభూతి కలుగుతుంది. పరిపాలనలో పేదలకు ప్రయోజనం చేకూర్చాలన్న ఆలోచన వచ్చినప్పుడు గద్దరన్నతో పాటు అందెశ్రీ సమానమైన స్ఫూర్తిని కలిగించారు. వారు రాసిన జయ జయహే.. గీతం కోట్లాది ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. తెలంగాణ ఏర్పడిన 10 సంవత్సరాల తర్వాత రాష్ట్ర గీతంగా కోట్లాది మంది ప్రజలకు స్ఫూర్తిని నింపుతోంది.

**నిప్పలవాగు పుస్తకం ఒక స్ఫూర్తి. ఒక ప్రజ్వలనం..**

అందెశ్రీ ప్రతి మాట, ప్రతి పాట ప్రజా జీవితం నుంచి వచ్చిందే. ప్రతి పాట ఉద్యమ స్ఫూర్తిని నింపింది. జీవితాంతం నిస్వార్థంగా తన రక్తాన్ని చెమటగా మార్చి, తన గళాన్ని తెలంగాణకు అంకితం చేశారు. అలాంటి అందెశ్రీ కుటుంబం ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో నాకు తెలుసు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం. అందెశ్రీని ఖననం చేసిన ప్రాంతాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దుతాం. తెలంగాణ ఉన్నంత కాలం అందెశ్రీ గారి పాత్రను శాశ్వతం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. వారు చేసిన రచనలకు సంబంధించిన పుస్తకం నిప్పులవాగు పుస్తకం ఒక స్ఫూర్తి. ఒక ప్రజ్వలనం. భవిష్యత్ తరాలకు ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్ లా తెలంగాణ యువతకు, ఉద్యమ కారులకు, సమస్యలపై పోరాటం చేసే వారికి దిక్సూచిలా పనిచేస్తుంది. తెలంగాణ సమాజానికి వారి రచనలు అందించే విధంగా నిప్పులవాగు పుస్తకాన్ని 20 వేల ప్రతులను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ లైబ్రరీల్లో ఉంచడానికి చర్యలు తీసుకుంటాం. ఇవే కాకుండా అందెశ్రీని అభిమానించే వారందరి సూచనలు తీసుకుని వారి పేరు శాశ్వతంగా, పదిలంగా ఉండటానికి ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటుంది. అందెశ్రీ ఏనాడూ ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ పరిస్థితుల గురించి ఆలోచన చేయలేదు.

# నేడో రేపో డీసీసీలు

- కాంగ్రెస్ లో పదవుల పందారం
- మార్పులు.. చేర్పులు
- ఈనెలలోనే స్థానిక ఎన్నికల షెడ్యూల్

**ఢిల్లీ, మహా:** బీహార్ ఎన్నికలతో పాటు తెలంగాణకు సంబంధించిన జూబ్లీహిల్స్ బైపోల్ కూడా ముగియడంతో కాంగ్రెస్ లో ఇక చకచకా సంస్థాగత బలోపేత చర్యలు జరుగుతున్నాయి. తెలంగాణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న డీసీసీల జాబితా నేడో, రేపో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి. ఏఐసీసీ పరిశీలకులు క్షేత్రస్థాయిలో పర్యటించి రూపొందించిన జాబితాపై కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ లతో పాటు ఇన్‌ఛార్జి మీనాక్షిల అభిప్రాయాలు కూడా తీసుకోగా, తుది జాబితాను నేడో రేపో ప్రకటించనున్నారు. మంగళవారం ఉత్తరాఖండ్ డిసిసిల జాబితా ప్రకటించగా, తెలంగాణ జాబితా కూడా సిద్దంగా ఉంది. జూబ్లీహిల్స్ రిజల్ట్ పై హ్యాపీగా ఉన్న కాంగ్రెస్ దిగ్గజాలు తర్వాత కార్యాచరణపై ఫోకస్ పెట్టాయి.

## ఈనెలలోనే స్థానిక షెడ్యూల్

జూబ్లీహిల్స్ బైపోల్ లో సానుకూల వాతావరణం ఉండడంతో వెంటనే స్థానిక ఎన్నికలకు వెళ్ళాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నారు. కారుపార్టీకి షాకులు తగిలిన సందర్భంలో బైపోల్‌కు వెళితే రాజకీయంగా ఫలితాలు ఏకపక్షమవుతాయని అంచనా వేస్తున్నారు. 32 జడ్పీలలో 30 జడ్పీలు ఖచ్చితంగా గెలవాలన్న టార్గెట్ తో సీఎం, పార్టీ శ్రేణులు ఉన్నాయి.

# సాహిత్య సమరయోధుడికి కడసారి వీడ్కోలు..





- అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు
- అందెశ్రీ పార్థీవ దేహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్
- అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసిన ముఖ్యమంత్రి
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు

**హైదరాబాద్, మహా:** ప్రముఖ కవి, రచయిత, ఉద్యమ గొంతుక, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ పార్థీవ దేహాన్ని సందర్శించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి నివాళులర్పించారు. ఎంతోకాలంగా అత్యంత సన్నిహితంగా మెలిగిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో భారమైన హృదయంతో ముఖ్యమంత్రి వారి అంతిమయాత్రలో పాల్గొని అశ్రునివాళి అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి అందెశ్రీ పాడె మోశారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు అక్షరయోధుడికి కడసారి వీడ్కోలు పలికారు. మొదట లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ నగర్ వరకు అంతిమ యాత్ర సాగింది. అందెశ్రీ సతీమణి మల్లు బాయి , కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయ పద్ధతిలో కర్మకాండలను నిర్వహించగా, అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి.. అందెశ్రీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమ సంస్కార కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. సాహిత్య సమరయోధుడి అంతిమయాత్రలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, సీతక్క , పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కే కేశవరావు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

## అందరికీ కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలింగ్ ముగిసిన అనంతరం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "గత నెల రోజులుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ ఏఐసీసీ కో-ఇన్‌చార్జిగా సచిన్ సావంత్

**ఢిల్లీ, మహా:** పలు రాష్ట్రాలకు కాంగ్రెస్ హైకమాండ్ కోఇన్‌చార్జులను నియమించింది. ఈ మేరకు మంగళవారం కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ కోఇన్‌చార్జిగా సచిన్ సావంత్ నియమితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ ఇన్‌చార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్‌కు సహాయకుడిగా సచిన్ పనిచేయనున్నారు. ఒడిశా కోఇన్‌చార్జిగా జెట్టి కుసుమ్ కుమార్, మధ్యప్రదేశ్ కోఇన్‌చార్జిగా ఉషానాయుడులను ఏఐసీసీ నియమించింది. దీంతోపాటు హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, జార్ఖండ్, మణిపూర్, బిహార్, పంజాబ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాలకు కూడా కాంగ్రెస్‌కు కొత్త కోఇన్‌చార్జులను నియమించింది.

# ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భీకర ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)



మృతుల్లో మద్దేడు ఏరియా కమిటీ ఇంచార్జ్ బుచ్చన్నతో పాటు అతని భార్య ఊర్మిల వంటి అగ్రనేతలు ఉన్నట్లు భద్రతా వర్గాలు ధృవీకరించాయి. ఘటనా స్థలంలో భారీగా పేలుడు పదార్థాలు, ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్ తదితర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ రేంజ్ అంతటా మావోయిస్టు కార్యకలాపాలను అణచివేయడంలో ఈ విజయం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని భద్రతా బలగాలు పేర్కొన్నాయి.

**నిఘా ఆధారిత ఆపరేషన్‌తో వేట**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై భద్రతా నిఘా విభాగం నుంచి సమాచారం అందింది. ఈ మేరకు, జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) సంయుక్త బృందాలు ఉదయం నుంచే దట్టమైన అడవుల్లో ఆపరేషన్ ప్రారంభించాయి. ఉదయం 10 గంటల సమయంలో దాగి ఉన్న మావోయిస్టులు బలగాలపై ముందుగా కాల్పులు ప్రారంభించగా, భద్రతా సిబ్బంది సమర్థవంతంగా ప్రతిదాడి చేశారు. ఈ ఎదురుకాల్పులు మధ్యాహ్నం వరకు కొనసాగాయి.

**మావోయిస్టు అగ్రనేతలకు భారీ ఎదురుదెబ్బ**

ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు చెందిన అగ్రనేత బుచ్చన్న, అతని భార్య ఊర్మిల మృతి చెందడం భద్రతా బలగాలకు పెద్ద విజయంగా పరిగణిస్తున్నారు. బుచ్చన్న బీజాపూర్ ప్రాంతంలో మద్దేడు ఏరియా కమిటీ ఇంచార్జ్‌గా కీలకపాత్ర పోషించేవాడు. మావోయిస్టు పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడంలో అతనికి ఉన్న అనుభవం దృష్ట్యా, ఈ దంపతుల మృతి ఆ సంస్థకు మానసికంగా, వ్యూహాత్మకంగా తీరని నష్టం కలిగించినట్లు భావిస్తున్నారు. మిగతా మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**

ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న వాటిలో ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రి ఉన్నాయి. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఇది మావోయిస్టుల దాచిన శిబిరం అని, సమీప ప్రాంతాలపై దాడుల కోసం ఇక్కడి నుంచే ప్రణాళికలు రచించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

**క్షీణిస్తున్న మావోయిస్టు ఉనికి**

బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం మావోయిస్టు సంస్థ తీవ్రంగా బలహీనపడింది. నాయకత్వం లేకుండా, సమన్వయం లేకుండా గుంపులుగా విరిగిపోయింది. వారి కార్యకలాపాలు ఇప్పుడు అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని సరిహద్దు గ్రామాలకు మాత్రమే పరిమితమయ్యాయి అని విశ్లేషించారు. నిఘా ఆధారిత ఆపరేషన్లు ఫలప్రదమవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విజయంతో ఆ ప్రాంత ప్రజల్లో భయాందోళనలు తగ్గి, శాంతి పునరుద్ధరణకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.

**అడవుల్లో బలగాల జల్లెడ**

ఎన్‌కౌంటర్ సమయంలో కొంతమంది మావోయిస్టులు అటవీ ప్రాంతాల్లోకి పారిపోయినట్లు సమాచారం. వీరిని పట్టుకునేందుకు అదనపు బలగాలను మోహరించి అడవులను జల్లెడ పడుతున్నారు. పొరుగు జిల్లాల్లోకి వారిని ప్రవేశించకుండా రహదారుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. బస్తర్, సుక్మా, దంతెవాడ జిల్లాల్లో కూడా ఆపరేషన్ కొనసాగుతోందని భద్రతా వర్గాలు తెలిపాయి.

**పెరిగిన ప్రజా మద్దతు**

మావోయిస్టు భయానికి గురైన అటవీ ప్రాంత ప్రజలు ఇప్పుడు ధైర్యంగా జీవిస్తున్నారని స్థానిక గ్రామస్థులు తెలిపారు. ఇటీవల నెలల్లో భద్రతా బలగాలు గ్రామాల్లో సైనిక శిబిరాలు ఏర్పాటు చేయడం, రహదారి సదుపాయాలు మెరుగుపరచడం వంటి చర్యలతో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. ఈ ఎన్‌కౌంటర్ ఘటన మావోయిస్టు ప్రభావాన్ని మరింత తగ్గించడంలో కీలకమవుతుందని ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

మహా పత్రిక 03
తెలుగు
బుధవారం, తిరుపతి | 12-11-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# టి- సాట్ అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విద్యార్థుల వార్షిక పోటీలు-2025

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభకు పట్టం
- 12,13 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు
- ముగింపు ఉత్సవాలకు హాజరుకానున్న మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా:** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు 'విద్యార్థుల వార్షిక పోటీలు 2025' పేరుతో పోటీలు నిర్వహిస్తున్నామని టిసాట్ సీఈవో బోదనపల్లి వేణు గోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 వతరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు మండల స్థాయి నుండి జోనల్ స్థాయి వరకు నిర్వహించారు. నవంబర్ నాల్గవ తేది నుండి మొదలై 13వ తేదీన రాష్ట్ర స్థాయిలో టిసాట్ వేదికగా జరిగే వేడుకలతో ఈ పోటీలు ముగియనున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 600లకు పైగా మండలాలు, 33 జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో సుమారు 22,000 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 10,000 విద్యార్దులకు మెరిట్ సర్టిఫికేట్స్ అందచేశామన్నారు. టిసాట్ వేదికగా నవంబర్ 12,13 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీల్లో క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ విభాగాలకు సంబంధించి దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొంటారని, వారికి మెరిట్ సర్టిఫికేట్లతో పాటు మెమెంటో అందచేయనున్నామన్నారు. ముగింపు ఉత్సవానికి రాష్ట్ర ఐటి, ఇండస్ట్రీస్ శాఖా మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

# అక్రమ వెంచర్ అరాచకం

## బండ్లగూడ జాగీరు కార్పోరేషన్ కమీషనర్ రూటే సెపరేటు...

## లోపాయికారిగా డీల్ కుదుర్చుకుని వెంచర్ నిర్వాహకులకు అండదండలు

**గండిపేట, మహ :** ప్రభుత్వ నిబంధనలు కాలరాస్తూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీరు కార్పోరేషన్ లో అక్రమ వెంచర్ వెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవటం కమీషనర్ చూసి చూడనట్లు వ్యవహరించటంలో మతలబేమిటో అర్థం కావటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. బండ్లగూడ జాగీర్ లోని సికిందర్ గూడ విలేజ్ లో పదెకరాలలో ఇల్లీగల్ లే అవుట్ వేసి అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నా అధికారులకు చీమ కుట్టినట్లు లేకపోవటం వెనక కాసులు చేతులు మారాయని ఆరోపణలు వస్తున్నాయి. ఓ పక్క ప్రభుత్వం దశాబ్దాలు గా స్లమ్ లు గా మగ్గిపోతున్న బస్తీలను గుర్తించి అక్కడ అక్కడ అధునాతన సౌకర్యాలతో టవర్ నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంగా ముందుకు సాగుతుంటే ...కొత్తగా వస్తున్న వెంచర్ లలో మరెన్ని సౌకర్యాలుండాలి....మరి బండ్లగూడ జాగీర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా పదెకరాలలో రాళ్ళు పాతి ప్లాట్లు చేసి అమ్మకాలు సాగిస్తుంటే టౌన్ ప్లానింగ్ ఏం చేస్తుంది. స్లమ్ లే లేకుండా చూడాలని ప్రభుత్వం దృష్టి సారిస్తుంటే ఇక్కడేంటి కోట్లు పెట్టి ప్లాట్లు కొనే వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వెంచర్ యజమానులు మోసం చేస్తుంటే అధికారులకు పట్టదా...! అక్రమ వెంచర్ అని తెలిసినా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఇంటి నిర్మాణాలకు పర్మిషన్ లు ఇస్తున్నారు. ఈ ఇల్లీగల్ వెంచర్ లో విల్లాలు నిర్మిస్తూ ఒక్కోటి రెండున్నర కోట్లకు మార్కెట్ లో బేరం పెడుతుంటే బాధ్యత వహించాల్సిన..ప్రజలకు జవాబుదారి తనంగా వ్యవహరించాల్సిన అధికారులు చోద్యం చూడటమెంటి. ఈ అక్రమ వెంచర్ పై మీడియా కమీషనర్ వివరణ అడగటానికి ఫోన్ లో సంప్రదిస్తే స్పందించక పోవటం ఏంటి. స్పందించక పోయినంత మాత్రాన అంతా సద్దుమనుగుతుందనుకుంటే ఎలా..?





## అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పట్టికను స్వాధీనం

**ఆమనగల్లు, మహా :** సారా తయారీ కోసం ముడి పదార్థాలను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహన్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుండి వివిధ గ్రామాలకు సారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం, పట్టిక వంటి ముడి పదార్థాలను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహన్ సిబ్బందితో కలిసి కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ వాహనంలో 120 కిలోల నల్ల బెల్లం,120 కిలోల పట్టిక లభించాయని సీఐ తెలిపారు. ఈ ఘటనలో నిందితులు ప్రవీన్, బిచ్చలను అరెస్టు చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ముడి పదార్థాలతోపాటు 2 మొబైల్ఫోన్లు, ఆటో రిక్షాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్, సిబ్బంది శంకర్ బాబు, శ్రీను, ఆమని తదితరులు పాల్గొన్నారు.

# వరద సాయం నిధులు విడుదల

## రూ.12.99 కోట్లు విడుదల చేస్తూ సర్కార్ ఉత్తర్వులు



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా మోంథా తుఫాను ప్రభావంతో ఇటీవల 16 జిల్లాల్లో భారీ వర్షాలు, వరద వల్ల నష్టపోయిన వరద బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం రూ.12.99 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాల్లో 8662 ఇండ్లు దెబ్బతిన్నాయి. వీరికి తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. అక్టోబర్ 27 నుంచి 30 వరకు వరుసగా నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలకు వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ 16 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.



మద్దులపల్లి ఊటవాగు అటవీ ప్రాంతంలో

## నెమళ్లను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ ఆఫీసర్లు

### వైద్య పరీక్షల అనంతరం ఖమ్మం అర్బన్ పార్క్ లో వదిలేసిన అధికారులు

**కామేపల్లి. మహా:** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్దులపల్లి దట్టమైన ఊట వాగు అటవీ ప్రాంతంలో కోయలు సాగు చేస్తున్న పోడు భూముల వద్ద మంగళవారం మూడు నెమలి పిల్లలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి మద్దులపల్లి ఊట వాగు వాగు సమీపంలో పోడు భూముల్లో కోయలకు మూడు నెమలి పిల్లలు కనిపించడంతో వెంటనే వారు తాళ్లగూడెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి శిల్పకు సమాచారం అందించారు. స్పందించిన ఆమె మద్దులపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగరాజు, ప్లాంటేషన్ ఆఫీసర్ సతీష్ తో పాటు సిబ్బందితో కలిసి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వాటిని కామేపల్లి పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ వాటికి పశు వైద్యాధికారి నాగులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారుల సూచనల మేరకు నెమలి పిల్లలను ఖమ్మం అర్బన్ పార్క్ కు తరలించారు

# మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

## మొదటి క్యాబినెట్‌లోనే మత్స్య శాఖకు రూ. 23 కోట్ల బడ్జెట్ కేటాయింపు

## రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

## 'నోవాటెల్'లో 'వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా 2025' కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా:** మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో హెచ్ఐసీసీ 'నోవాటెల్'లో ఏర్పాటు చేసిన 'వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా 2025' కాన్ఫరెన్స్‌కు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా మత్స్య శాఖపై రూపొందించిన పాటను మంత్రి సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. కాన్ఫరెన్స్‌లో మత్స్య సంపద, మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి పైన ప్రధానంగా చర్చ చేయనున్నారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మత్స్యకారుల కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. గతంలో నిర్వీర్యానికి గురైన మత్స్య శాఖను పునర్నిర్మాణం చేస్తూ, మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి క్యాబినెట్‌లోనే మత్స్య శాఖకు దాదాపుగా 123 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని తెలిపారు. మత్స్యకారులందరి తరపున సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి ఈ సందర్భంగా మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఒక కోటి 40 లక్షల రూపాయలతో మత్స్యకారులకు ఇన్సూరెన్స్ కల్పించడం జరిగిందని తెలిపారు. గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉండటమే కాకుండా, తెలంగాణకు గొలుసు కట్టు చెరువులు ఒక గొప్ప వరం అన్నారు. ఈ నీటివనరులు మత్స్య సంపదకు ఎంతగానో దోహదపడతాయని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మత్స్యశాఖ క్రియాశీలకంగా మారేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఎన్ఎఫ్‌డీబీ సీఈఓ బెహరా, జాయింట్ సెక్రటరీ నీతు కుమారి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐకార్ జాయ్ కృష్ణ, పీవీఎన్ఆర్ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞాన ప్రకాష్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు.



## కబ్జా కోరల్లో సర్కారు భూములు వాగులు

### భూ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మచ్చ జంగయ్య

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంగళపల్లి, చింతపల్లి గూడ గ్రామాలలోని ప్రభుత్వ భూములు, పులంద్రి వాగును కబ్జాదారుల చెర నుండి విడిపించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మచ్చ జంగయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి, చింతపల్లిగూడ రెవెన్యూ గ్రామాలలోని సర్వే 58, 57, 56, 60 నెంబరులో గల సర్కార్ భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, ఇబ్రహీంపట్నం తాసిల్దార్ సునీత రెడ్డికి, ఫిర్యాదు చేసిన, భూముల పరిరక్షణ సమితి నియోజకవర్గం అధ్యక్షులు, మచ్చ జంగయ్య, ఉపాధ్యక్షులు గంటిల వెంకటేష్ ప్రభుత్వ భూములను కాపాడాలని తాసిల్దారును కోరారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ... భూకబ్జా దారులు, మంగళపల్లి, చింతపల్లిగూడ రెవెన్యూ గ్రామాల నుండి పారుతూ పోయే పులంద్రి వాగులో రాళ్ళు, రప్పులతో కూడిన మట్టిని వేసి, వాగును కబ్జా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రెవెన్యూ అధికారులు వెంటనే మోఖాపైకి సంబందిత అధికారులను పంపించి, అక్రమ ఇండ్ల నిర్మాణాలను నిలిపివేసి, చట్టపరమైన చర్యలు తీసుకొని, కబ్జాదారుల చెర నుండి భూమిని విడిపించి, సర్వేయర్ ద్వారా సర్వే చేయించి, అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కాపాడాలని మచ్చ జంగయ్య అధికారులను కోరారు. లేని పక్షంలో హైడ్రాలో ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

# ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి కామెంట్స్

- సానుభూతిని పొందే ప్రయత్నం.. కానీ జరగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నికల్లో ఓడిపోతున్నామన్న అసహనంతో బీఆర్ఎస్ అభ్యర్థి మూడు రోజులుగా ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి కామెంట్స్ చేస్తున్నారని విమర్శించారు. తమ అభ్యర్థిని అవమానపరిచే విధంగా మాట్లాడుతూ.. సానుభూతిని పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం పొన్నం ప్రభాకర్‌మీడియాతో మాట్లాడుతూ.. తల్లి మీకు దండం పెట్టుకుంటున్నాం.. ఎన్నికల్లో మీరు పోటీ చేసినారు.. మీ నాయకత్వం మీకు సరైన విధంగా సహకరించారా? లేదా? అనే అంశం పక్కన పెట్టి.. మా అభ్యర్థి విజయం కోసం మా పార్టీ నాయకత్వం అంతా కలిసి పని చేశామన్నారు. ఏ పార్టీ నాయకులైనా వారు స్థానికేతరులైతే ఎన్నికలు జరిగే సమయంలో తిరిగితే వారిపైన కేసులు పెట్టుకోవచ్చని పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రచారం ముగిసిన తర్వాత ఎవరు కూడా ఎక్కడ నియోజకవర్గంలో కనబడడానికి వీలులేదని, ఈసీ తమ కార్యాచరణ ప్రకారం ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఏ పార్టీ అయినా కేసులు పెట్టుకోవచ్చన్నారు. పోలీసులు కూడా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాజకీయంగా సానుభూతి పొందాలనే ప్రకటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు.


# మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను కొనసాగించాలి

**ఆమనగల్లు, మహా :** ప్రతి ఒక్కరూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు,అడుగుజాడల్లో నడుస్తే దేశం అభివృద్ధి చెందుతుందని కో అప్షన్ సభ్యులు జహంగీర్ బాబా అన్నారు.భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి,మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవనాన్ని పురస్కరించుకొని కడ్తాల్ పట్టణంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సంధర్భంగా జహంగీర్ బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్పతనాన్ని నెహ్రూ పార్లమెంట్ లో ప్రసంగించారని గుర్తు చేశారు. విద్య రంగం అభివృద్ధి చెందాలంటే మౌలానా ఆశయాలను కొనసాగించాలని సూచించారు.భారత ప్రభుత్వం మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించి ఆజాద్ జన్మదిన సందర్భంగా ఆ రోజు నేషనల్ ఎడ్యుకేషన్ డే గా ప్రకటించారని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకరన్నారు..ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగాళ్ల లక్ష్మయ్య, నాయకులు అస్గర్ అలీ, భరత్ యాదవ్, భాను కిరణ్, తుప్పరి మహేష్, మోత్యా నాయక్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం

ఆమనగల్లు పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కేఎన్ఆర్ సేవాదళంవ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా, మండల జేఏసీ అధ్యక్షులు అవ్వారి శివలింగం, ఎన్ఎస్యు ఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో పోషించిన కీలక భూమికను వివరించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన త్యాగాలను, పోరాట పటిమను నవ సమాజానికి తెలిసేలా చాటి చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. కరీమ్, పూసల పరమేష్,ఆమనగల్లు మండల ఉపాధ్యక్షులు సూదిని కొండల్ రెడ్డి,కండె సాయి, మహేష్, ఖలీమ్ ఇమ్రాన్,శీను తదితరులు పాల్గొన్నారు.



# హరే కృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్ట్‌కు విరాళం

## రూ.50 లక్షల విరాళం అందజేసిన శ్రీనర్సింగ్ క్లాత్ ఎంపోరియం

**హైదరాబాద్, మహా:** హరేకృష్ణ మూవ్‌మెంట్ - హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక హరే కృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్ట్‌కు ప్రముఖ వ్యాపార సంస్థ శ్రీ నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ. 50 లక్షల విరాళం లభించింది. ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ నర్సింగ్ క్లాత్ ఎంపోరియం మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ సింగానియా, డైరెక్టర్ రవికాంత్ సింగానియా ఆధ్వర్యంలో ఈ విరాళాన్ని అందజేశారు. ఈ విరాళ చెక్కును హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస ప్రభూజీకి అందజేశారు. దీంతో శ్రీ నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుండి హరే కృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్ట్‌కు మొత్తం విరాళంగా రూ. 1.14 కోట్లు అందించబడ్డాయి. అదే విధంగా ఈ సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 300 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని కూడా నిర్ణయించింది. ఈ సందర్భంగా సత్యగౌర చంద్రదాస ప్రభూజీ మాట్లాడుతూ.. నర్సింగ్ క్లాత్ ఎంపోరియం సంస్థ దాతృత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజంలో ఇలాంటి సేవా దృక్పథం కలిగిన వ్యాపార సంస్థల సహకారం వల్లే భారతదేశం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం, భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందుతుంది అని కొనియాడారు.

## జూబ్లీహిల్స్ పోలింగ్ 48.24 శాతం

### ప్రకటించిన ఎన్నికల సంఘం

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 48.24 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పురుషులు 47.59 శాతం మంది, మహిళలు 48.95 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలను పరిశీలిస్తే.. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 52.76 శాతం, 2014లో 50.18 శాతం, 2018లో 45.59 శాతం, 2023లో 47.58 శాతం పోలింగ్ నమోదైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 ఓటర్లు, ఇందులో పురుషులు 2,08,561 మంది, మహిళలు 1,92,779 మంది ఉన్నారు.

# రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు సింగల్ విండో ఆధ్వర్యంలో అమనగల్లు మార్కెట్ యార్డు ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు బుధవారం స్థానిక విలేకరులతో వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించడానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించడం జరుగుతుందన్నారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని వరికి క్వింటాలుకు మద్దతు ధర రూ. 2369 పైసలు మరియు సన్న రకం వడ్లకు రూ. 5, వందల బోనస్ ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక, మండల ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, వ్యవసాయ అధికారులు సరియగు సమయానికి హాజరు కావాలని గంప వెంకటేష్‌గుప్తా కోరారు. ఈ సమావేశంలో సింగల్ విండో వైస్ చైర్మన్ డి. సత్యం, సింగల్ విండో సీఈఓ గోరటి దేవేందర్ పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ హైడ్రామా!

- దొంగ ఓట్లు వేస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి ఆరోపణ
- కృష్ణా నగర్ పోలింగ్ బూత్ దగ్గర మాగంటి సునీత ధర్నా
- ఆమెతో పాటు నిరసనకు దిగిన పలువురు బీఆర్ఎస్ లీడర్లు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం
- మాగంటి సునీత, కౌశిక్ రెడ్డి సహా పలువురు నేతల అరెస్ట్



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ బై పోల్స్ ప్రశాంతంగా ముగిశాయినా పోలింగ్ అనంతరం హైడ్రామా నడిచింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది. ఉదయం నుంచి ప్రశాంతంగా ప్రారంభమైన పోలింగ్.. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించిన చిన్నపాటి ఘటనలు జరిగాయి. మరల అధికారులు వాటిని రిప్లేస్ చేశారు. మరోవైపు పలు చోట్ల కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. స్థానికేతర ప్రజాప్రతినిధులు జూబ్లీహిల్స్‌లో ఉండి ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారని అదే విధంగా ఓటర్లను ప్రభావితం చేసే పనుల్ని చేస్తున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని కృష్ణా నగర్ పోలింగ్ బూత్ దగ్గర ఫేక్ ఐడిలతో దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ధర్నాకు దిగారు. దీంతో కృష్ణా నగర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కృష్ణానగర్, శ్రీనగర్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలను నకిలీ ఆధార్ కార్డులతో దొంగ ఓట్లు వేయిస్తున్నారని మాగంటి సునిత ఆరోపించారు. చివరి నిమిషంలో ఫేక్ ఓట్లు, రిగ్గింగ్ చేస్తూ అక్రమాలకు ాల్పడుతున్నారని మాగంటి సునీత, బీఆర్ఎస్ నేత కౌశిక్ రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి నిరసనకు దిగారు.

**పలువురు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్..**

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి దొంగ ఓట్లు వేయిస్తున్నారని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ ఓట్లు వేసేవారికి పోలీసులు సహకరిస్తున్నారంటూ మాగంటి సునిత వాగ్వివాదానికి దిగారు. పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. చనిపోయిన వ్యక్తుల పేరుతో కూడా ఓటేశారని, ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అయితే సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, మాగంటి సునీత, కౌశిక్ రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అధికారులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నిరసనపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు వర్గాల ఆందోళనతో భారీగా పోలీసుల మోహరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను చెదరగొట్టిన పోలీసులు, బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు.



# ఇకపై అలా చేయను : అను

నేను తెలుగు తమిళంలో స్టార్ హీరోలతో నటించాను. పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, నాని, నాగచైతన్య, శివకార్తికేయన్, కార్తి, విశాల్..ఇలా హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నాను. అయితే నా కెరీర్ లో కొన్ని సినిమాలు చేసి ఉండకూడదు అని ఇప్పుడు రిగ్రెట్ ఫీల్ అవుతున్నా. కొన్ని కమర్షియల్ మూవీస్ లో నటించడం వల్ల నటిగా నాకు ఎలాంటి సంతృప్తి లభించదు. నాలుగు డ్యాన్స్ స్టెప్స్ వేసి, ఏవో డైలాగ్స్ చెప్పిస్తారు. ఈ రొటీన్ మూవీస్ చేసేప్పుడు నేను రియలైజ్ కాలేదు గానీ ఇకపై అలాంటి మూవీస్ చేయకూడదు అని నిర్ణయించుకున్నా' అని అన్నారు హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్. ఈ బ్యూటీ కీలకపాత్రలో, రష్మికదీక్షిత్ శెట్టి జంటగా నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' మూవీ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దుర్గ అనే క్యారెక్టర్‌లో అను నటించింది. ఈ మూవీకి హిట్ టాక్ వచ్చిన నేపథ్యంలో తాజాగా అను మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అనుభవాలతో పాటు తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా కోసం మొదట ప్రొడ్యూసర్ ధీరజ్ నుంచి కాల్ వచ్చింది. ఆ తర్వాత రాహుల్ కలిసి స్క్రిప్ట్ చెప్పారు. స్క్రిప్ట్, నా క్యారెక్టర్ గురించి విన్న తర్వాత తప్పకుండా ఈ మూవీలో నటించాలని అనిపించింది. అమ్మాయిల గురించి ఒక మంచి విషయం చెప్పే మూవీ ఇది. ఈ చిత్రంలో నటించడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఇది గీతా ఆర్ట్స్ సినిమా కాబట్టి బాగా చూసుకుంటారనే నమ్మకం ఉంది. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాకు వస్తున్న రెస్పాన్స్ హ్యాపీగా ఉంది. అయితే నేను ఏ సినిమా చేసినా ఆ మూవీకి ఎలాంటి ప్రశంసలు వస్తాయని ఆశించను. ఈ చిత్రంలో దుర్గ క్యారెక్టర్ లో నటించాను. ఫస్టాఫ్ లో కొన్ని సీన్స్ చూస్తున్నప్పుడు నా క్యారెక్టర్ ను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే భయంవేసింది. కానీ ఆ తర్వాత డైరెక్టర్ రాహుల్ నా క్యారెక్టర్ ను తీర్చిదిద్దిన విధానంతో హ్యాపీగా ఫీలయ్యా. రాహుల్ చాలా సెన్సిటివ్ డైరెక్టర్. నా క్యారెక్టర్ ఒక్కటే కాదు, అన్ని పాత్రలను చేయి పట్టి నడిపించారు. కమర్షియల్ మూవీస్ లో మాతో ఓవర్ యాక్షన్ చేయిస్తారు. ఈ చిత్రంలో నాకు అవకాశం వచ్చేసరికే రశ్మికను భూమా పాత్రకు తీసుకున్నారు. నేను భూమా పాత్రలో నటించాలని ఎప్పుడూ అనుకోలేదు. హాలీవుడ్ లో మూవీస్ చూస్తే హీరో హీరోయిన్ విలన్ ఇలా విభజన ఉండదు. ప్రతి ఒక్కరూ కథకు కాంట్రిబ్యూట్ చేసేలా క్యారెక్టర్స్ చేస్తారు. ఈ చిత్రంలో రాహుల్ అలాంటి ప్రయత్నమే చేశారు. అన్ని పాత్రలను జస్టిఫై చేసేలా మూవీ రూపొందించారు. నా కెరీర్ పరంగా అసంతృప్తిగానే ఉన్నా, అయితే నటిగా సంతృప్తి ఉంది. పెద్ద పెద్ద స్టార్స్ తో కలిసి నటించాను. అయితే నాది అవకాశాల కోసం ఆరాటపడే తత్వం కాదు. నాకు వచ్చే సినిమా తప్పకుండా దక్కుతుందని నమ్ముతా. ప్రొడ్యూసర్ ధీరజ్ తో గతంలో ఊర్వశివో రాక్షసివో సినిమా చేశాను. "ది గర్ల్ ఫ్రెండ్" లాంటి చిత్రాలు వర్కవుట్ కావాలంటే ధీరజ్ లాంటి మంచి ప్రొడ్యూసర్ ఉండాలి. మంచి టీమ్ కుదరకే గతంలో కొన్ని ఫీమేల్ సెంట్రిక్ మూవీస్ ఆదరణ పొందలేకపోయాయి.ప్రస్తుతం కొన్ని ప్రాజెక్ట్స్ డిస్కషన్స్ స్టేజ్ లో ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేను.

# విజయ్ దేవరకొండను విచారించిన సీఐడీ సిట్..!



ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ సీఐడీ సిట్ విచారణ ముగిసింది. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్స్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విజయ్ సహా పలువురు ప్రముఖులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇందులో భాగంగా సిట్ అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్ల విషయంలో సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తున్నది. దాదాపు గంటకుపైగా విజయ్ సీఐడీ కార్యాలయంలో ఉన్నాడు. విచారణ పూర్తయిన తర్వాత సీఐడీ కార్యాలయం వెనుక గేట్ నుంచి వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా.. విజయ్ దేవరకొండతో పాటు నటుడు ప్రకాశ్‌రాజ్‌కు ఇటీవ అధికారులు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పలువురు ప్రముఖులను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ సైతం కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో కొందరు నటీనటులను ప్రశ్నించింది. మరో వైపు ఇటీవల ఈడీ మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు సంబంధించిన రూ.11కోట్లకుపైగా ఆస్తులను జప్తు చేసిన విషయం తెలిసిందే.



# ప్రతి స్త్రీ శరీరంలో వచ్చే మార్పులే నాలో కూడా వచ్చాయి: తమన్నా

సౌత్ ఇండియాతో పాటు బాలీవుడ్‌లో కూడా తమన్నాకు ఫ్యాన్స్ ఉన్నారు. ఇండస్ట్రీకి వచ్చి తాను సుమారు 20 ఏళ్లు అవుతుంది. కెరీర్ ఆరంభంలో తన శరీరాకృతి ఎలా ఉండేదో ఇప్పుడు కూడా వెండితెరపై అలాగే కనిపిస్తుంది. ప్రస్తుతం 35 ఏళ్ల వయసుకు చేరుకున్న ఈ మిల్కీ బ్యూటీ ఫిట్‌నెస్ విషయంలో అస్సలు రాజీ పడదు. షూట్స్ ఉన్నా లేకున్నా క్రమం తప్పకుండా వర్కౌట్లు చేయడం.. ఆహారం విషయంలోనూ సరైన డైట్ ఫాలో అవుతుంది. అందుకే తనలో ఎలాంటి మార్పులు లేవు. కానీ, రీసెంట్‌గా తమన్నా కాస్త బరువు పెరిగారని, బెల్లీ ఫ్యాట్ కూడా వచ్చేసిందని బాలీవుడ్‌లో వార్తలు వచ్చాయి. దానిని కంట్రోల్‌లో చేసుకునేందుకు ఓజెంపిక్ వంటి బరువు తగ్గించే ఇంజెక్షన్లను ఉపయోగిస్తుండవచ్చని నెటిజన్లు ఊహించగా, మరికొందరు ఆమె రిఫ్రెష్, మెరిసే రూపాన్ని చూసి మెచ్చుకున్నారు. అయితే, ఈ రూమర్స్‌పై తమన్నా నేరుగా ప్రస్తావిస్తూ.. ఒక ఇంటర్వ్యూలో నిజాన్ని తెలిపింది. తన రూపం పూర్తిగా సహజమైనదని చెప్పని తమన్నా తన బరువును తగ్గించుకునేందుకు ఎలాంటి ఇంజెక్షన్లు ఉపయోగించలేదని ఇలా చెప్పింది. 'నాకు 15 సంవత్సరాల వయస్సు నుండి కెమెరా ముందు కనిపిస్తున్నాను. మొదట్లో నేను ఎలా ఉండేదానినో ఇప్పుడూ అలాగే ఉన్నాను. నా ఎదుగుదలను ప్రేక్షకులు చూస్తూనే ఉన్నారు. ఇక్కడ దాచడానికి ఏమీ లేదు. నాకు 20 ఏళ్ల వయసప్పుడు సన్నని శరీరంతోనే ఉన్నాను. ఇప్పుడూ అలాగే ఉన్నాను. నేను సహజంగానే అలా ఉన్నాను. నేను ఇలాగే పెరిగాను. నాలో ఎలాంటి మార్పులు లేవు.'అని ఆమె చెప్పింది.

## వాళ్ల దృష్టిలో బరువు పెరిగాను

'నేను నటించిన హిందీ చిత్రాలను మాత్రమే చూస్తున్న ప్రేక్షకులు నా శరీరాకృతిలో మార్పులు వచ్చాయని కాస్త ఆశ్చర్యకరంగా భావిస్తారు. అందులో వారి తప్పులేదు.. ఎందుకంటే.., వారు నా సినీ ప్రయాణాన్ని రీసెంట్‌గా చూస్తున్నారు. నా తొలి దశలో వచ్చిన సినిమాలు చూడలేదు. కాబట్టి హిందీ ప్రేక్షకులకు నేను బరువు పెరిగినట్లు కొత్తగా అనిపిస్తుంది. కానీ, నేను 100 సినిమాలకు దగ్గరగా ఉన్నాననే విషయం వారందరికీ తెలియకపోవచ్చు. ప్రజలు నన్ను చాలా విభిన్న పాత్రలలో నా శరీరంలో వచ్చిన మార్పులు వివిధ దశలలో చూశారు.' అని ఆమె వివరించారు.

## స్త్రీ శరీరం ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది

'ఒక స్త్రీ శరీరం ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది. ప్రతి ఐదు సంవత్సరాలకు కొన్ని మార్పులు కనిపిస్తాయి. మనం మనలోని విభిన్న వెర్షన్‌ను చూస్తాము. ముఖ్యంగా కోవిడ్ సమయంలో నా శరీరం చాలా దెబ్బతింది. నా 20 ఏళ్లలో ఉన్నట్లే నా శరీరాన్ని ఉంచుకోవడం ఆ సమయంలో చాలా కష్టమైంది. కాస్త బరువు పెరిగాను. దాంతో నా శరీరంలో ఎక్కువ మార్పులు వచ్చాయి. బరువు పెరిగి నా కడుపు కనిపిస్తోందా..? అని నేను అనుకునే సందర్భాలు చాలు ఉన్నాయి. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కానీ, ప్రతి స్త్రీ తన చక్రంలో తన శరీరం మారడాన్ని గుర్తిస్తుంది. దానికి నేను ఏమీ మినహాయింపు కాదు.' అని ఆమె చెప్పింది.



**గిన్నిస్ బుక్‌లో బాలీవుడ్ సింగర్**

# 3,800 హార్ట్ సర్జరీలకు ఆర్థిక సాయం

బాలీవుడ్ ప్రముఖ గాయని పలక్ ముచ్చల్ తన మంచి మనసుతో గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. ఆర్థిక సాయం అందక గుండె సమస్యలతో బాధపడుతున్న దాదాపు 3,800 మందికి పైగా పేద పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేయిందేందుకు నిధులు సమకూర్చి గిన్నిస్ బుక్‌లో కెక్కింది సింగర్. పలక్ పలాష్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చి నిరుపేద పిల్లలకు హార్ట్ సర్జరీలు చేయించింది ఈ సింగర్. అయితే ఈ విషయంపై ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సింగర్.. తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పలక్ ముచ్చల్ ఇండోర్‌లో జన్మించింది. ఒకసారి రైలు ప్రయాణంలో పేద పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన పలక్.. నిరుపేద చిన్నారుల కోసం ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో ఈ సేవా సంస్థను స్థాపించింది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapatrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034